కథ

# రంగునీళ్ళు

**పి.వి.ప్రభాకరమూర్తి**

చెరువుగట్టుమీద వున్న రావిచెట్టుకు జారబడి కూర్చున్నాను. సంధ్య వెలుగు రావి ఆకులమీదపడి మిలమిలా మెరుస్తూ పచ్చచీర చుట్టుకున్న పడతిలా ఉంది. పక్షులు కిలకిలా రావాలతో గూళ్ళకు చేరుకుంటున్నాయి. కష్టపడి పనిచేసి డ్యూటీనుండి దిగిన కార్మికుడిలా బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ పడమరవైపు పడుకోడానికి వెళ్ళిపోయాడు సూర్యుడు. తెల్లగా, చల్లగా డ్యూటీ ఎక్కాడు చంద్రుడు. రాజకీయ నాయకుడి వెంట సెక్యూరిటీగార్డుల్లా తనతోపాటు కొన్ని నక్షత్రాల్నీ తీసుకొచ్చాడు. ఆఫీసుకి లేటుగా వచ్చే ఉద్యోగుల్లా ఆకాశంలో రెండు కొంగలు హడావిడిగా వచ్చి రావి చెట్టు మీద వాలాయి. నెమ్మదిగా చీకటి ముసురుతోంది. చెట్ల నీడలు చిక్కబడుతున్నాయి. దూరంగా చింతచెట్టు జుట్టు విరబోసుకున్నట్టుగా వుంది.

నాకు బొమ్మలు వేయడం అంటేనే చాలా ఇష్టం. ''నువ్వు వేసిన ప్రతి బొమ్మ జీవం ఉట్టిపడుతున్నట్లే ఉంటుంది'' అంటుంది నా మనసు. చిన్నప్పటినుంచి అది అంతే. అందరూ నన్ను రంగుల రత్నాకరం అంటుంటే నేను చాలా గొప్పగా ఫీలయ్యేవాడిని. అలా ఫీలయ్యి ఫీలయ్యి ఆరో తరగతి ఆరుసార్లు ఫెయిలయ్యాను. ప్రకృతి ఆరాధన పట్లా, బొమ్మ వేయడం పట్లా నాకు ఎక్కువ మక్కువగా ఉండేది. చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడంలో చాలా ఉత్సాహం చూపించేవాడిని. రత్నాకరం క్షణాల్లో ఎలాంటి బొమ్మయినా వేయగలడు అనే విషయం ఊళ్ళో ప్రతి ఒక్కళ్ళకి తెలుసు.

''చదువుకోరా రత్నం! బొమ్మలు మనకు కూడు పెట్టవురా నాయనా'' అనేది అమ్మ. ఆ బొమ్మలే నాకు ఇప్పుడు కూడు పెడుతున్నాయన్న సంగతి చచ్చిపోయిన అమ్మకేం తెలుసు? మనసులో అనుకున్నాను.

''ఏరా రత్తిగా రేపు ఏ బొమ్మ గీస్తున్నావేంటి'' గేదెలు ఇంటికి తోలుకుపోతూ అడిగాడు ఏసోబు.

''ఆ ఏదో గీస్తాలే'' ఇంటికి వెళ్ళడానికి లేస్తూ సమాధానం చెప్పాను.

నులకమంచం మీద వెల్లకిలా పడుకుని రేపు భానుగుడి దగ్గర రోడ్డుమీద వేయాల్సిన బొమ్మ గురించి ఆలోచిస్తున్నాను. నేను రోడ్డుమీద బొమ్మ లేయడం మొదలెట్టి సరిగ్గా రేపటికి సంవత్సరం అవుతోంది. రేపు అందరిని ఆకట్టుకునే బొమ్మ వేయాలి. మా ఊరికి కాకినాడ నాలుగు మైళ్ళు ఉంటుంది. రోజూ నాకున్న డొక్కు సైకిలు తొక్కుకుంటూ భానుగుడి సెంటరుకి వెళ్ళి రోడ్డు మీద బొమ్మ వేసి, జనం సంతోషంతో దానిమీద వేసే చిల్లర ఏరుకుని సాయంత్రానికి ఊరు చేరుకోవడం రోజూ నేను చేసే పని. రేపు గురువారం కాబట్టి సాయిబాబా బొమ్మ వేయాలని నిర్ణయించుకున్నాను.

వారంలో ఐదు రోజులు రోడ్డుమీద బొమ్మలు వేస్తాను. మిగిలిన రెండు రోజులు ఇంటివద్దే నాకిష్టమయిన వాటర్ కలర్స్‌తో పెయింటింగ్స్ వేస్తూంటాను. ఇల్లు అంటే ఏదో పెద్ద మహలు అనుకునేరు. మా ఊరి పంతులుగారింట్లో దొడ్డివైపున పడీపడనట్లున్న పెంకుటింటి వసారా అన్నమాట. పంతులుగారి దయవలన నేను చాలాకాలం నుంచీ అక్కడే ఉంటున్నాను. ఆ వరండాలో ముగ్గురం ఉంటాము. నేను, పగలంతా సూర్యుడు, రాత్రయ్యాక చంద్రుడు. నేను రాత్రి సమయాల్లో వరండాబయట నులకమంచం మీద పడుకుని ఆలోచనల్లో పడటం, అలాగే పడుకోవడం రోజూవారీ జరిగే పని. వర్షాకాలంలో వరండాలో వున్నా, ఆరుబయట వున్నా ఒకలాగే ఉంటుంది. పంతులుగారి తల్లి అప్పుడప్పుడూ ప్రసాదం పంపుతూ ఉంటారు. అది తిని కొండంత బలం తెచ్చుకుంటూ వుంటాను. పండగ రోజుల్లో భోజనం, బొబ్బట్లు మామూలే. ఆ స్థల మహత్యం కాబోలు నాలో కొంతకాలం నుంచీ మంచీ, చెడూ, దేవుడంటే భయం, భక్తి ఇవన్నీ అబ్బాయి లక్షణాలన్నీ మంచివే కాబట్టి నా శరీరం, మనసూ ఇవేవీ వాటికి అభ్యంతరం చెప్పలేదు.

ఆ ఇంట్లో నేను ఉండిపోవడానికి వారి మంచితనమే కాకుండా, నేను వున్న వరండాకి అవతలి గది కిటికీ నుంచి చూస్తుంటే కనిపించే పంట చేను రవివర్మ పెయింటింగ్‌లా వుంటుంది. పంట పొలాల మీదుగా వచ్చే చల్లనిగాలి, దూరాన కొండలు, చేలో కొంగల బారులు. మెరిసే అంచున్న మేఘం. ఇంటికెళ్ళిపోతున్న సూర్యుడు. గాలికి అటూ ఇటూ ఊగే పైరు ఇవన్నీ వర్ణనాతీతం. రవివర్మ ఉంటే ఎంత డబ్బయినా ఇచ్చి ఆ పాడుబడ్డ పెంకుటిల్లు కొనుక్కొని, ఆ కిటికీ ముందు కూర్చుని అద్భుతమయిన చిత్రాలు వేసే వాడేమో! రవివర్మలా కాకపోయినా ఒకశాతమయినా ఆ దృశ్యాన్ని వాటర్ కలర్స్‌తో చిత్రించాలని వుండేది. మనసులో ఏ మూలో ఆ కోరిక నివురుగప్పిన నిప్పులా ఉండిపోయింది.

సన్నగా చినుకులు మొదలవ్వడంతో మంచాన్ని కొంతయినా రక్షించేందుకు వరండాలో కొద్దిపాటి చినుకులు పడే చోట గోడకు జారబెట్టాను. మిగిలిన ప్రదేశంలో వర్షం బయటకన్నా ఎక్కువే పడుతోంది. గోడవారగా వున్న ఓ గడ్డిమొక్క దానికి వున్న చిన్నపువ్వును చూసుకుని కాబోలు చిరుగాలికే గర్వంగా అటూ ఇటూ ఊగుతోంది. ఓ పావుగంటసేపు వర్షం ఎడాపెడా వాయించి వెళ్ళిపోయింది. పొద్దున్న వండుకున్న అన్నం తీసి కంచంలో పెట్టుకుని, సగం అంచు విరిగిన జాడీలో వున్న ఆవకాయ వేసుకుని కలుపుకున్నాను. ఆవకాయన్నంలో వెల్లుల్లిపాయ హల్వా మీద జీడిపప్పులా కనిపిస్తోంది. కంచం దూరం నుంచి చూసేవారికి దరిద్ర దేవత కన్నులా ఎర్రగా కనిపిస్తుందేమో! నా ఊహకి నాకే నవ్వొచ్చింది. కంచం కడిగేసి గూట్లో వుంచి, నులక మంచం వాల్చాను.

ఉదయాన్నే లేచి రంగు చాకోపీసులు వున్నాయో లేదో చూసుకుని అవన్నీ ప్లాస్టిక్ కవర్లోపోసి సైకిలుకి తగిలించి, పట్నానికి బయలుదేరాను. సాయిబాబా బొమ్మ నేను వేసినట్లు బహుశా ఎవరూ వేయరేమో! ఆ బొమ్మనే జనం అడగటం వల్ల రెండు, మూడు రోజులు వుంచేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. డబ్బులు మిగతా బొమ్మలకన్నా సాయిబాబా బొమ్మకే ఎక్కువగా వేస్తారు. రోజుకి చిల్లరంతా కలిపి వంద రూపాయల వరకూ వస్తుంది. భానుగుడి సెంటర్‌కి చేరుకుని రోడ్డు పక్కన శుభ్రం చేసి బొమ్మ వేయడం రెండు గంటల్లో పూర్తి చేసాను. అందరూ చూస్తూ వెడుతున్నారు. కొందరు దండం పెట్టుకుంటున్నారు. అక్కడే వుంచిన పళ్ళెంలో కొందరు చిల్లర వేస్తున్నారు. ఇంతలో చిట్టిబాబు టీ ఫ్లాస్కుతో తయారయ్యాడు. వాడి చేతిలో రెండు రూపాయలు పెట్టాను. వాడి దగ్గర టీ అలవాటయి తాగటం కానీ అసలు రుచీపచీ వుండదు. రంగునీళ్ళలో పటిక బెల్లం ముక్క ముంచి తీసినట్టుగా వుంటుంది. టీ దరిద్రంగా ఉందని నన్ను చెప్పనీయకుండా,

''బొమ్మ ఇరగదీసావుగురూ'' అన్నాడు చిట్టి బాబు.

సాయంత్రం చిల్లరంతా లెక్కపెడితే అనుకున్నట్లే వంద రూపాయలు వచ్చింది. చిల్లరంతా పక్కనే వున్న పబ్లిక్ ఫోనువాడికి ఇచ్చి నోట్లు తీసుకున్నాను. ఆ సెంటర్లోనే వున్న ఎ టు జెడ్ ఎంపోరియంలో వాటర్ కలర్స్, కాగితాలు కొని సైకిలెక్కాను. మనస్సంతా వాటర్ కలర్స్‌తో వెయ్యబోయే బొమ్మమీదే వుంది. ఆ ఆలోచనలతోనే ఊరుచేరుకున్నాను. సైకిలు వరండాలో పెట్టి, కాళ్ళు కడుక్కుంటుంటే పంతులుగారి మనవడు ''మా బామ్మ ఇమ్మంది'' అంటూ ఒక పొట్లాం చేతిలో పెట్టి తుర్రుమన్నాడు. పొట్లాం విప్పి చూసాను. చక్రపొంగలి. నోట్లో నీళ్ళూరాయి. పది నిమిషాల్లో పొట్లం ఖాళీ అయింది. పొట్టనిండింది. బామ్మగారు చేసిన చక్రపొంగలి తిన్నాక ఏది తిన్నా గడ్డితో సమానమే. అంత రుచిగా చేస్తుందావిడ. మనవడి చేత మళ్ళీ మరో పొట్లాం పంపితే బాగుండుననిపించింది. అత్యాశ అనర్థం అనుకుని చేతులు కడుక్కుని నులకమంచం వాల్చాను.

మర్నాడు ఉదయం భగవంతుడిని తల్చుకుని పెన్సిల్‌తో స్కెచ్ గీయడం మొదలుపెట్టాను. రెండు, మూడు, నాలుగు గంటలు దొర్లాయి. సాయంత్రం వాటర్ కలర్స్ వేసాక అసలు రూపం అప్పుడు బయటపడింది. 'అద్భుతంగా వచ్చింది' మనసులోనే అనుకున్నాను. చేతులు కడుక్కుంటుంటే పంతులుగారి మనవడు పులిహోర ప్లేటుతో వచ్చాడు. ''అంకుల్ బొమ్మ చాలా బావుంది'' దగ్గరగా వచ్చి షేక్‌హేండ్ ఇచ్చాడు. పంతులుగారి మనవడివల్ల బొమ్మగురించి వీధి అంతా తెలిసిపోయింది. తెలుగు మాష్టారు వచ్చి ''పైకి వస్తావురా అబ్బాయ్'' అంటూ వెళ్ళిపోయారు.

''నేను డ్రాయింగ్ మాష్టరునయినా ఇలాంటి బొమ్మ వేయలేనురా'' డ్రాయింగ్ మాస్టారు సుందరంగారు బొమ్మను పరిశీలిస్తూ అన్నారు. ''నువ్వు తప్పకుండా ఈ ఊరు గర్వించతగ్గ కళాకారుడివి అవుతావు'' మున్సబుగారు అన్నారు చేతిలో వంద రూపాయలు పెడుతూ.


ఇక బామ్మగారి ఆనందం వర్ణించలేనంతగా ఉంది. ''నీలాంటివాడు మా ఇంట్లో వున్నాడంటే నిజంగా మా ఇంటిల్లిపాదికీ ఎంతో గర్వంగా ఉంది. నీ పేరు మీద రాములవారి గుళ్ళో అర్చన చేయించి ప్రసాదం తీసుకు వస్తున్నాను. నువ్వు నిండు నూరేళ్ళు పిల్లాపాపలతో కులాసాగా వుండాలిరా బాబూ'' అంటూ ప్రసాదం చేతిలో ఉంచారు. ప్రసాదం కళ్ళకద్దుకుని నోట్లో వేసుకున్నాను.

''నిజానికి నేను అందరి అభిమానాలు చూరగొనేంత కళాకారుడినా'' నామీద నాకే సందేహం వచ్చింది. నిజం కాకపోతే ఇంతమంది పొగడరు కదా! ఒకింత గర్వం తొణికిసలాడింది.

రెండు రోజుల తర్వాత పంతులుగారి చిన్నబ్బాయి పరంధామ్ అమెరికా నుండి పిల్లాపాపలతో వచ్చాడు. నేను పరంధామ్ బోర్డు స్కూలులో చదివాం. లక్ష్మీదేవి, సరస్వతీదేవి కరుణాకటాక్షాల వల్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీరయి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు పరంధామ్. నాకు మాత్రం సరస్వతీదేవి కరుణవున్నా లక్ష్మీదేవి చిన్నచూపువల్ల, వెండి కాసుల మధ్య చిల్లుకాణీలా ఇలా మిగిలిపోయాను. ''ఒరేయ్! బామ్మ నీ బొమ్మ గురించి చెప్పిందిరా, ఆవిడ మాటల్ని బట్టి బొమ్మను చూడటంలో ఆలస్యం చేయకూడదని వెంటనే వచ్చానురా'' అన్నాడు ధాము.

''ఒరేయ్ రత్నం! ఈ పెయింటింగ్ నీ దశ తప్పకుండా మారుస్తుందిరా. చాలా బాగా వేసావు, కలర్ కాంబినేషన్ నిజంగా అద్భుతం'' భుజం తడుతూ అన్నాడు ధాము.

''నాకు తెలిసిన ఒకాయన కాకినాడ బోట్‌క్లబ్ ఎదురుగా బ్యాంక్ కాలనీలో ఉన్నారు. ఆయన పేరు రఫీక్‌పాషా. ఆర్ట్ ఎగ్జిబిషన్స్ అవీ ఏర్పాటు చేస్తూంటారు. సాయంత్రం ఒకసారి ఆయన దగ్గరకి వెళ్ళి మాట్లాడదాం. నీ పెయింటింగ్ ఆయనకు తప్పకుండా నచ్చుతుందన్న నమ్మకం నాకుంది. ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసినట్లయితే, మిగతా పెయింటింగ్స్‌తో



పాటు నీ పెయింటింగ్స్ కూడా ఉంచే ఏర్పాటు చేస్తారు. ఒక రాయి విసురుదాం. తగిలితే తగులుతుంది. లేదా రాయి పోతుంది. మన దేశంలో రాళ్ళకు కొదవలేదుగా'' అన్నాడు ధాము ఉత్సాహంగా. సాయంత్రం రడీగా ఉండు అంటూ వెళ్ళిపోయాడు.

వాడు చెప్పింది కలా నిజమా అర్థం కావటం లేదు. రోడ్డుమీద బొమ్మలేసుకునే నాకు ప్రఖ్యాత చిత్రకారుల సరసన నిలుచునే అర్హత ఉందా! వీళ్ళంతా నన్ను ఏడిపించడానికి పొగుడుతున్నారా! అంతలో మనసు నన్ను మొట్టికాయ వేసి కథ చెప్పటం మొదలుపెట్టింది. ''వీధి దీపం క్రింద చదువుకుని అబ్రహాం లింకన్ అమెరికాకు ప్రెసిడెంట్ అవలేదా! అంటూ మొదలెట్టి పెద్దవాళ్ళందరూ ఒకే రాత్రిలో పెద్దవాళ్ళవలేదు. ఒక్కొక్క మెట్టే ఎక్కి శిఖరం చేరుకున్నారు. నువ్వు కూడా అంతే ఈరోజున ఇక్కడ. మళ్ళీ సంవత్సరం లండన్‌లో ఉండచ్చు'' చెప్పుకుంటూ పోతోంది మనసు. ఉవ్వెత్తున ఎగిసిపడే గర్వాన్ని అణుచుకోవడం నావల్ల కాలేదు.

## గ్లామర్ సీక్రెట్

**ఇండో జర్మన్ భామ పార్వతీ మెల్టన్‌ని మీ గ్లామర్ రహస్యం ఏంటీ అని అడిగితే- 'అసలు నా పర్సనాలిటీ ఏ తరహా డ్రెస్‌కైనా సూటయ్యేలా వుంటుంది. అంతే కాదు, డ్రెస్సింగ్‌లో కూడా నేనెప్పుడూ అతిగా వుండను. సింపుల్ డ్రెస్సులు ధరించడమే కాదు, దానికి తగిన జ్యుయలరీ కూడా చాలా సింపుల్‌గా వుండేలా చూసుకుంటాను. అందుకే అలా ఆకట్టుకుంటానేమో' అంటుంది ముసిముసిగా నవ్వుతూ. కావచ్చు కదా!**

సాయంత్రం ధాము, నేను బ్యాంక్ కాలనీకి బయలుదేరాం. రఫీక్‌పాషాగారి ఇల్లు ఎక్కడ అని అడిగాం. తొమ్మిదో నెంబరు ఇల్లండి అని చెప్పారు కాలనీ వాళ్ళు. గేటు తెరిచేసరికి ఆయన భార్య కాబోలు లోపలికి సాదరంగా ఆహ్వానించి ''నమాజు చేసుకుంటున్నారు కూచోండి'' అని లోపలికి వెళ్ళిపోయారు. ఓ పది నిమిషాల్లో పాషాగారు వచ్చారు. పరిచయాలు అయ్యాక ధాము చెప్పటం మొదలుపెట్టాడు.

''రత్నాకరం బొమ్మలు చాలా బాగా వేస్తాడండి. వాడు వేసిన బొమ్మల్లో జీవం ఉట్టిపడుతుంది. రెండు రోజుల క్రితం 'నేటి ప్రకృతి'' అనే బొమ్మ వేసాడు. నిజంగా అద్భుతం. మేఘాల చాటున అస్తమించే సూర్యుడు నిజంగా పెయింటింగ్ మీదే అస్తమిస్తాడేమో అన్నట్లుగా వేసాడు. కొంగలబారులు రెప్పవాలిస్తే ఎగిరిపోతాయేమోనన్నట్లు వున్నాయి. మీ అనుమతి ఇస్తే పెయింటింగ్ తీసుకువస్తాము. దాన్ని దయచేసి మీరు ఏర్పాటు చేయబోయే ఎగ్జిబిషన్లో ఏదో మూల ఉంచితే మీ మేలు మేము ఎప్పటికి మరువలేం'' ముగించాడు ధాము. ''మీరు అంతగా చెబుతున్నారు కాబట్టి రేపు ఉదయం పది గంటలకి పెయింటింగ్‌ని తీసుకురండి. దాన్ని చూసి మిగతా విషయాలు మాట్లాడుకుందాం. తర్వాత అంతా మీ అదృష్టం'' అన్నారు పాషాగారు రేపు కలుద్దాం అన్నట్లుగా మావైపు చూస్తూ. ''మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేం సార్'' అన్నాను.

''ఋణాలు గట్రా ఏమీ వుండవు బాబూ, నీ దగ్గర సరుకుంటే పైకి వస్తావు లేదంటే ఎక్కడ గొంగళి అక్కడే. సూర్యోదయాన్ని అడ్డుకోవడం మనవల్లవదు కదా!'' అని లోపలికి వెళ్ళిపోయారు. నేను కృతజ్ఞతగా ధాము వైపు చూసాను. కంట్లో నీటిపొర అడ్డం వచ్చి వాడు కనిపించలేదు.

''ఒరేయ్ రత్నం! రామారావు పేటలో మా అత్తయ్యగారింటికి వెళ్ళి రెండుగంటల్లో వచ్చేస్తాను, అంతవరకు నువ్వు పార్కులో వుండు'' అంటూ వెళ్ళిపోయాడు ధాము. అప్పుడే ఇంటికి వెళ్ళి చేసేదేమీ లేదుకదా అనుకుంటూ ఎదురుగా వున్న బోట్‌క్లబ్ వైపు నడిచాను. చల్లగాలి స్వాగతం పలికింది. బఠాణీలు కొని లాన్‌లో కూర్చున్నాను. ప్రేమజంటలతో పార్కు దాదాపు నిండిపోయింది. ఆ చుట్టుపక్కల బహుశా నేను ఒక్కడినే ముదురు బెండకాయ అనుకుంటా. పక్కనున్న సిమెంటు బెంచీ మీద జంట విచిత్రంగా అనిపించింది. అమ్మాయి అద్భుతమైన అందంతో చిదిమితే పాలు కారేలా వుంది. అబ్బాయి తారుడబ్బాకి నల్లరంగు వేసినట్లుగా వున్నాడు. వాడిలో ఏ ఆకర్షణ వుందో వాడు మాట్లాడితే చాలు అమ్మాయి గలగలా నవ్వేస్తోంది. కొద్దిపాటి వెలుగులో వాడి ముఖం చూడటానికి నేను చేసిన ప్రయత్నం సఫలం కాలేదు. వాడు నవ్వినప్పుడు మాత్రం పళ్ళు అన్నీ లెక్కపెట్టేంత స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రేమ పరమగుడ్డిది సుమా అనుకున్నాను. దూరంగా వర్షం పడుతున్నట్లుగా మట్టివాసన వస్తోంది. చల్లగాలికి చిన్న చిన్న మొక్కలన్నీ తలలూపుతున్నాయి. జంటలన్నీ ఇళ్ళకి వెళ్ళాలన్న బాధతో కాబోలు బద్ధకంగా పార్కు బయటకు బయలుదేరాయి. ఒక్కసారి వాతావరణం మారిపోయింది. మెల్లగా మొదలయిన గాలి, వర్షంతోడవటంతో విజృంభించింది. అడ్వర్టైజుమెంటు బోర్డు ఒకటి గాలిలోకి ఎగిరిపోతోంది. షాపువాడు దాన్ని పట్టుకుని షాపులోకి తీసుకెడుతున్నాడు.

ఆ దృశ్యం చూసాక, ఉన్నట్టుండి నా వెన్నులో చలి మొదలయింది. ''నా పెయింటింగ్, నా పెయింటింగ్'' పిచ్చాడిలా అరుచుకుంటూ రోడ్డుమీదకి పరుగెత్తాను. పరుగెడుతూనే ఉన్నాను. కాలికి ఎదురుదెబ్బ తగిలి రక్తం చివ్వున ఉబికింది. అమ్మా అని బాధతో అరవాలని అనిపించలేదు. ''నా పెయింటింగ్, నా పెయింటింగ్'' అరుచుకుంటూనే రోడ్డుమీద పరుగుపెడుతున్నాను. ఎంతసేపు పరుగెట్టానో తెలియదు. వరండాలోకి వచ్చిపడ్డాను. పెయింటింగ్ వేసిన గది అంతా రంగునీళ్ళతో నిండిపోయింది. అస్తమిస్తున్న సూర్యుడు, కొంగలబారులు, మెరుపుమచ్చల మేఘాలు, ఆ రంగునీళ్ళలో దాక్కుని నన్ను వెక్కిరిస్తున్నాయి. బోర్డుమీద పెయింటింగ్ స్థానంలో దాదాపు తెల్లకాగితం ఉంది. పేపరు మీద అక్కడక్కడా సూర్యుడికి వేసిన ఎర్రరంగు చారికలు కనిపిస్తున్నాయి. నా కళ్ళలో కూడా అటువంటి ఎర్రచారికలు బహుశా వుండేవుంటాయి. నులకమంచం మీద వాలాను. పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్టుగా, ఎర్రబడ్డ నా కళ్ళకి చంద్రుడు ఎర్రగా కనిపిస్తున్నాడు. రోడ్డుమీద రేపు ఏం బొమ్మవేయాలా అని ఆలోచిస్తూ నులకమంచం వాల్చాను.

☆

